# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 352 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 5 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 352 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 5 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur



# అమరావతి మునిగిందన్న వాళ్లను పూడ్చిపెట్టాలి

## వరద సహాయక చర్యల్లో చంద్రబాబు ఫుల్ బిజీ

## వరదలపై ప్రజలను భయపెట్టేలా వైసీపీ విష ప్రచారం చేస్తోందని ఆగ్రహం

## ఇలాంటి దుర్మార్గులకు రాష్ట్రంలో ఉండే అర్హత లేదని వ్యాఖ్యలు

## ఇలాంటి వాళ్లను సంఘ బహిష్కరణ చేయాలని పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు విజయవాడలో వరద సహాయక చర్యల పర్యవేక్షణలో తలమునకలుగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీపై ధ్వజమెత్తారు. అమరావతి మునిగిందన్న వాళ్లను పూడ్చిపెట్టాలని అన్నారు. వరదలపై వైసీపీ విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తప్పుడు ప్రచారం చేస్తారా? ఇలాంటి దుర్మార్గులకు రాష్ట్రంలో ఉండే అర్హత ఉందా? అని చంద్రబాబు ప్రశ్నించారు. రాజకీయ నేరస్తులను, తప్పుడు ప్రచారం చేసేవాళ్లను సంఘ బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పాటుపడుతుంటే రాక్షసుల్లా అడ్డుకుంటున్నారు... ప్రజలకు సేవ చేస్తూనే మరోవైపు రాక్షసులతో పోరాడుతున్నా... క్షమాపణ చెప్పేవరకు వాళ్లను విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. బుడమేరు గండ్లు ఇంకా పూడ్చాల్సి ఉందని చంద్రబాబు వెల్లడించారు. విజయవాడకు బుడమేరు ఓ సమస్యగా మారిందని అన్నారు. కృష్ణా నది కంటే బుడమేరుతోనే విజయవాడకు తీవ్ర నష్టం అని తెలిపారు. బుడమేరు వాగును ఆక్రమించారని, 2019 నుంచి ఆక్రమణలు జరిగాయని చంద్రబాబు ఆరోపించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గాడిదలు కాసిందా? అంటూ మండిపడ్డారు. బుడమేరు ఆక్రమణలపై సర్వే చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్లను కూడా తవ్వేశారని తెలిపారు. వైసీపీ తప్పులకు అమాయకులు వేదనకు గురయ్యారని, ఓ వ్యక్తి అహంభావానికి ప్రజలు ఇబ్బందులు పడాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. అందరికీ నాణ్యమైన ఆహారం అందజేస్తామని, ముంపు ప్రాంతాల్లో ఆహారంతో పాటు తాగునీరు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. 8 లక్షల వాటర్ బాటిల్స్ అందించామని చెప్పారు. కొన్ని చోట్ల మున్సిపల్ వాటర్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. అధికారులందరూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని వివరించారు. వరద బాధితులందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించారు. కేంద్ర మంత్రి అమిత్ షాతో ఫోన్ లో మాట్లాడానని, వరద ప్రాంతాల్లో పర్యటించాలని కోరానని వెల్లడించారు. రేపు ఉదయానికి వరద పూర్తిగా తగ్గిపోతుందని భావిస్తున్నామని వెల్లడించారు. కృష్ణా నదికి మరో 40 వేల క్యూసెక్కుల వరద వస్తే విజయవాడకు మరింత ప్రమాదం అని అన్నారు.

## వరద బాధితులకు అండగా పవన్..

### తెలుగు రాష్ట్రాలకు రూ.6 కోట్ల భారీ విరాళం



- తెలంగాణకు రూ.1 కోటి, ఏపీలోని 400 పంచాయతీలకు రూ.4 కోట్ల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్
- తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇస్తున్నట్లు చెప్పిన పవన్ కల్యాణ్
- ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1 కోటి ప్రకటించిన ఏపీ డిప్యూటీ సీఎం
- 400 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.1 లక్ష చొప్పున విరాళం

వివరాలు 2లో..

## వైసీపీ నేతల అరెస్ట్ కు రంగం సిద్ధం...

### ఇంటి నుంచి పరారైన మాజీ ఎంపీ నందిగం సురేశ్



- టీడీపీ కార్యాలయంపై దాడి కేసు
- ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు
- నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులు

వివరాలు 2లో..

## విజయవాడ బుడమేరుకు మళ్లీ పెరుగుతున్న వరద

- బుడమేరులో నిన్న వెయ్యి క్యూసెక్కుల ప్రవాహం
- ఈరోజు 8 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చే అవకాశం ఉందన్న అధికారులు
- గండ్లను పూడ్చే పనులను పర్యవేక్షిస్తున్న లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**విజయవాడను చిగురుటాకులా వణికించిన బుడమేరుకు మళ్లీ వరద పెరుగుతోంది. నిన్న బుడమేరులో వెయ్యి క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. కానీ, ఈరోజు వరద ప్రవాహం పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి 8 వేల క్యూసెక్కుల వరద వస్తుందని అధికారులు తెలిపారు. గండి పడిన చోట ప్రస్తుతం బుడమేరు

వివరాలు 2లో..

## కొంప కొల్లేరు.. బెజవాడ బుడమేరు

- సింగ్ నగర్ లో వరద బాధితులను పరామర్శించిన షర్మిల
- వరదలకు బుడమేరే కారణమని వ్యాఖ్య
- హైడ్రా మాదిరి బుడమేరు ఆక్రమణలను తొలగించాలని సూచన



**పెన్ పవర్ డెస్క్:** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద ముంపుకు గురైన సింగ్ నగర్ ప్రాంతంలోని బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటిస్తూ ప్రజలకు ధైర్యం చెపుతుండటం మంచి విషయమని చెప్పారు. విజయవాడ వరదలకు బుడమేరే కారణమని అన్నారు. కొంప కొల్లేరయిందని..

వివరాలు 2లో..

## బొత్స సత్యనారాయణకు నిరసన సెగ

- విజయవాడలో వరద బాధితులను పరామర్శించిన బొత్స
- ఐదు రోజుల తర్వాత ఎందుకొచ్చారని ప్రశ్నించిన బాధితులు
- సాయం అందకుండా అడ్డుపడుతున్నారంటూ ఆగ్రహం



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు నిరసన సెగ తగిలింది. ఈ సాయంత్రం విజయవాడలోని రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులను బొత్స పరామర్శించారు. ఈ సందర్భంగా వరద బాధితులు ఆయనను నిలదీశారు. తమ ప్రాంతంలో ఇళ్లు మునిగిన ఐదు రోజుల తర్వాత ఎందుకొచ్చారని బొత్సను బాధితులు నిలదీశారు. ప్రభుత్వం అందిస్తున్న సాయం తమకు అందకుండా అడ్డుపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితులకు ఇప్పటి వరకు వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బొత్స స్పందిస్తూ... "అధికారంలో లేనివాళ్లం... ఏం చేస్తాం?" అంటూ అక్కడి నుంచి కదిలారు.

## నారా లోకేశ్ కు చంద్రబాబు కీలక ఆదేశాలు



- బుడమేరు గండ్లను పూడ్చే కార్యక్రమాలను
- పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశం
- గండ్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్న లోకేశ్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**విజయవాడను ముంచెత్తిన బుడమేరు గండ్లను పూడ్చివేసే కార్యక్రమాలను పర్యవేక్షించాలని మంత్రి నారా లోకేశ్ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సీఎం ఆదేశాల

వివరాలు 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలి

### అమిత్ షాకు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విజ్ఞప్తిలి

- కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేసిన తెలంగాణ నేతలు
- విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

వివరాలు 2లో..



## వరద బాధితులకు రూ.120 కోట్ల భారీ విరాళం ప్రకటించిన ఏపీ ఎన్జీవో

- ఏపీలో ఇటీవల భారీ వర్షాలు
- విజయవాడ ప్రాంతంలో వరద బీభత్సం
- లక్షలాది మందిపై వరద ఎఫెక్ట్
- ఒక రోజు వేతనాన్ని విరాళం ఇచ్చిన ఏపీ ఉద్యోగులు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ఉద్యోగులు వరద బాధితుల సహాయార్థం భారీ విరాళం ప్రకటించారు. తమ ఒకరోజు వేతనాన్ని వారు విరాళంగా ఇచ్చారు. ఏపీ ఎన్జీవో జేఏసీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.120 కోట్ల విరాళం అందించింది. ఈ మేరకు ఏపీ ఎన్జీవో నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏపీ ఎన్జీవో జేఏసీని అభినందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని రంగాల వరకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వరద బాధితులకు ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటామని స్పష్టం చేశారు.

## ఇప్పుడు అదే విజయవాడకు శాపంగా మారింది

- బుడమేర 90 శాతం ఆక్రమణకు గురైందన్న పవన్ కల్యాణ్
- క్లిష్ట పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థవంతంగా పని చేస్తున్నారని కితాబు
- వైసీపీ నేతలు విమర్శలు మాని సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచన



**పెన్ పవర్ డెస్క్:**బుడమేరులోని 90 శాతం ఆక్రమణకు గురైందని, ఇదే ఇప్పుడు విజయవాడకు శాపంగా మారిందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రస్తుత

వివరాలు 2లో..

## సంపాదకీయం

### సిరిసంపదలకు.. విజయానికి కారకుడు ఎవరో తెలుసా..

విఘ్నాలకు అధిపతి.. గణాలకు అధినేత.. దైవశక్తుల్లో ముఖ్యుడు. పనులు సజావుగా సాగాలంటే గణపతి పూజ చేయాల్సిందే. పైగా ఈ ఆదిదేవుడు సిరిసంపదలకు, విజయాలకు, అభివృద్ధికి కారకుడనే భక్తులకు గట్టి నమ్మకం. ఆ నమ్మకం మన దగ్గరే కాదు.. విదేశీ ప్రజలకు కూడా ఉంది. అందుకే గుళ్లు కట్టి మరీ పూజిస్తున్నారు. విలక్షణ రూపాలతో, మారు పేర్లతో అందరివాడిగా విఘ్నేశుడు ప్రపంచం నలుమూలలా పూజలు అందుకుంటున్నాడు.

ఇండోనేసియాలో గజా అనే పేరుతో వినాయకుడు. పూజలు అందుకుంటున్నాడు. అక్కడి ప్రజలు గజానునుడిని రక్షకుడిగా భావిస్తారు. ఎనిమిదవ శతాబ్దం నుంచే గణనాధుడికి ఇక్కడ ఆలయాలు ఉన్నట్లు చారిత్రక ఆధారాలు చెప్తున్నాయి. ముఖ్యంగా పదిహేను ఆలయాల్లో ఇప్పటికీ ప్రతీరోజు పూజలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మికంగానే కాకుండా తమ దేవుడికి ఎన్నో రకాలుగా గౌరవం ఇస్తున్నారు ఇక్కడి ప్రజలు. ఇండోనేసియాలోనే అతిపెద్ద ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఐటీబీ(బన్దుంగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) లోగోగా గణేషుడి రూపం ఉంటుంది. అంతేకాదు. కరెన్సీ నోట్ల మీద కూడా గజా రూపాన్ని ముద్రించింది. అక్కడి ప్రభుత్వం.

పాలరాతి విగ్రహం

బాలీ ద్వీపానికి ఈశాన్య దిశగా ఐదు మైళ్ల దూరంలో మెంజంగన్ ఐల్యాండ్ ఉంది. మెంజంగన్ అంటే 'దుప్పి" అని అర్థం. వసంత రుతువులో దుప్పులు మందలుగా ఈ ద్వీపానికి వస్తుంటాయి. కిలోమీటర్ పైగా అవి గుంపులు గుంపులుగా వచ్చే దృశ్యం చూడటానికి బాగుంటుంది. అందుకే స్థానికులు ఈ ద్వీపానికి మెంజంగన్ పేరు పెట్టారు. ఈ ద్వీపంలో సముద్రం ఒడ్డున ఉంది పుర సెగర గిలి ధర్మ కెస్కినా ఆలయం. ఈ గుడిలో పెద్ద గణేశుడి పూజలు అందుకుంటోంది. ఈ దేవుడు సముద్రం నుంచి అక్కడి దీవులను రక్షిస్తాడని స్థానికుల సమ్మకం. ఇరవై నాలుగు గంటలు తెరిచి ఉండే ఈ గుడిలో ఉచిత 20000 దర్శనం ఉంటుంది.

బిల్దార్ రీజియన్ లోని బారా టెంపుల్ (12వ శతాబ్దానికి చెందింది).

రాటు బోకో ఆలయం. ఈ గుడిలో గణేశుడి విగ్రహం అసంపూర్తిగా ఉంటుంది..

ప్రంబనన్ టెంపుల్. దీనికే లోరోజోంగ్లింగ్ అనే మరొక పేరుంది. ఇండోనేసియాలోనే అతిపెద్ద హిందూ దేవాలయం ఇది. (19వ శతాబ్దానికి చెందింది). ఈ శివాలయం కాంప్లెక్స్ లోని వినాయకుడి గుడిలోకి పెళ్లికానీ వాళ్లను మాత్రమే. దర్శనానికి అనుమతిస్తారు.

పెనాతరన్ ఆలయం. 12వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. అయినా పూజలు మాత్రం జరుగుతున్నాయి. ఈ గుడిని బాగుచేయాలనే డిమాండ్ తో సోషల్ మీడియాలో ఒక క్యాంపెయిన్ రన్ అయ్యింది. బాలి ద్వీపంలోని పుర బుహూర్ ఉలువాటు ఆలయం. ఈ గుడి గేట్ దగ్గర గణేశుడి పాత విగ్రహాలు రెండు ఉంటాయి. వీటికి ప్రత్యేక పూజలు జరిపిన తర్వాతే ఆలయంలోని స్థానిక దేవుళ్లకు పూజలు చేస్తారు.

బౌద్ధ, హిందూ దేవాలయంగా పేరున్న పుర బ్లానో జోంగ్. బాలిలోని సనుర్ ప్రాంతంలో ఈ గుడి ఉంది. ఈ గుడి కాంప్లెక్స్లో గణేశుడి మండపం 9వ శతాబ్దానికి చెందింది. బ్రాహ్మణులు మాత్రమే ఈ గణేశుడికి పూజలు చేసేందుకు అర్హులు.

సురబయలోని సంగ్గార్ అగుంగ్ టెంపులోని విఘ్నేశుడికి హిందువులు, బౌద్ధులతో పాటు చైనీయులు, లోకల్ కమ్యూనిటీ కెవావెన్ కూడా పూజిస్తారు

# ఇప్పుడు అదే విజయవాడకు శాపంగా మారింది

- మొదటి పేజీ తరువాయి

క్లిష్ట పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థవంతంగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు. ఈ వయస్సులో కూడా జేసీబీలు, ట్రాక్టర్లను ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన బాగా పని చేస్తుంటే ప్రశంసించాల్సింది పోయి వైసీపీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముందు సహాయక చర్యల్లో పాల్గొని, ఆ తర్వాత విమర్శలు చేయాలని వైసీపీ నేతలకు సూచించారు. తాను వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించకపోవడంపై పవన్ కల్యాణ్ వివరణ ఇచ్చారు. తాను ఆ ప్రాంతాలకు వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బందులు వస్తాయన్నారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి ఉంటుందని చెప్పడం వల్ల తాను వెళ్లడం లేదన్నారు. తాను పర్యటించకపోవడంపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు.

వైసీపీ నేతలు తనతో వస్తానంటే తన కాన్వాయ్‌లోనే తీసుకు వెళ్తానన్నారు. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలని వ్యాఖ్యానించారు. ఇది ఏ ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రానికి చెందిన అంశమన్నారు. కాబట్టి వైసీపీ నేతలు సహాయం చేసిన తర్వాత మాట్లాడాలని హితవు పలికారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కూడా పాల్గొంటుందన్నారు.

175 బృందాలు

విజయవాడ పట్టణ ప్రాంతంలో పని చేస్తున్నట్లు తెలిపారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి 900 మంది పారిశుద్ధ్య కార్మికులు వచ్చారన్నారు. వరదల కారణంగా ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిన్నట్లు చెప్పారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పని చేస్తున్నాయన్నారు. నేవీ నుంచి 2, ఎయిర్ ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

# వరద బాధితులకు అండగా పవన్..

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. తెలుగు రాష్ట్రాల వరద బాధితుల సహాయార్థం రూ.6 కోట్ల భారీ విరాళం ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు మరియు వరదల కారణంగా సంభవించిన విధ్వంసాన్ని చూసి చలించిపోయిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి భారీ విరాళం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1 కోటి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1 కోటి విరాళం అందించనున్నారు. అలాగే పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నందున, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వరద ముంపు బారిన పడ్డ 400 పంచాయతీలకు..ఒక్కో పంచాయతీకి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.4 కోట్లు విరాళం ఇవ్వాలని నిర్ణయించారు.

మొత్తంగా, పవన్ కళ్యాణ్ ఇరు తెలుగు రాష్ట్రాలకు కలిపి వ్యక్తిగతంగా రూ. 6 కోట్ల భారీ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా మరియు పంచాయతీరాజ్ మంత్రిగా రాష్ట్రంలోని ప్రతి వరద ప్రభావిత ప్రాంతం వద్ద

సహాయక చర్యలను పర్యవేక్షిస్తుండంతో పాటు, ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే, పవన్ ప్రకటించిన ఈ డబ్బులు కనీసం పారిశుధ్య పనులకైనా పనికొస్తే ప్రభుత్వంపై భారం తగ్గుతుందని భావిస్తున్నట్లు పవన్ వెల్లడించారు.

## విజయవాడ బుడమేరుకు మళ్లీ పెరుగుతున్న వరద

- మొదటి పేజీ తరువాయి

ప్రవాహం 3 అడుగులకు చేరింది. ఇప్పటికి ఒక గండిని పూడ్చారు. మిగిలిన రెండు గండ్లను పూడ్చే పనులు జరుగుతున్నాయి. పనులను మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. గండ్లను పూడ్చే ప్రక్రియను పర్యవేక్షించాలని నిమ్మల రామానాయుడిని లోకేశ్ కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలి

**పెన్ పవర్ డెస్క్:** భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఏరియల్ సర్వే నిర్వహించాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కోరారు. వారి విజ్ఞప్తికి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఏరియల్ సర్వేకు కేంద్రం సిద్ధమైంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. ఈరోజే ఈ ప్రకటన వెలువడే అవకాశముందని భావిస్తున్నారు. కేంద్రమంత్రి ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం తెలుగు రాష్ట్రాల్లోని దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు.

## కొంప కొల్లేరు.. బెజవాడ బుడమేరు

- మొదటి పేజీ తరువాయి

. బెజవాడ బుడమేరు అయిందని షర్మిల వ్యాఖ్యానించారు. బుడమేరు ద్వారా వచ్చే వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మరోసారి ఇలాంటి విపత్తు రాకుండా చూడాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందని చెప్పారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో హైడ్రా మాదిరి... బుడమేరు ఆక్రమణలను కూడా వెంటనే తొలగించాలని అన్నారు. బుడమేరుకు రిటర్నింగ్ వాల్ కట్టాలని సూచించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై షర్మిల మండిపడ్డారు. ఏపీ ఎంపీల మద్దతుతోనే పీఎం అయ్యాననే సంగతి మోదీ మర్చిపోయారని విమర్శించారు. మోదీ వెంటనే స్పందించి వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రతి ఇంటికి రూ. లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు.

# నారా లోకేశ్ కు చంద్రబాబు కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

మేరకు నారా లోకేశ్ రంగంలోకి దిగారు. బుడమేరు కుడివైపు, ఎడమవైపు పడిన గండ్ల గురించి అధికారులను అడిగి వివరాలను లోకేశ్ తెలుసుకున్నారు. గండ్లు పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోకేశ్ పర్యవేక్షణలో విజయవాడలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సీఎం ఆదేశాల మేరకు లోకేశ్ బుడమేరు వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. విజయవాడలో వరద ప్రభావానికి గురైన 36 వార్డుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

నిన్న రాత్రి, ఈ ఉదయం ఎగువన కురిసిన వర్షాల వల్ల బుడమేరుకు 10 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... బుడమేరు పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... కొండపల్లి శాంతినగర్ వద్ద ఉన్న చెరువు కట్ట కూడా తెగిందని చెప్పారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో ఉన్నవారంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాను జక్కంపూడి కాలనీ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ లో వరద బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేసే పనుల్లో నిమగ్నమై ఉన్నానని చెప్పారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తనకు ఫోన్ చేయాలని సూచించారు.

# వైసీపీ నేతల అరెస్ట్ కు రంగం సిద్ధం...

**పెన్ పవర్ డెస్క్:** 2021 అక్టోబర్ 19న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్ తదితరులు నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వీరు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే వీరి పిటిషన్లను హైకోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకుంటామని... అప్పటివరకు (రెండు వారాల పాటు) తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును వీరు కోరారు. ఈ విన్నపాన్ని కూడా హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో వీరిని అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధమయింది.

నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసేందుకు కాసేపటి క్రితం పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే పోలీసులు వస్తున్న విషయాన్ని ముందుగానే తెలుసుకున్న సురేశ్... ఇంటి నుంచి పరారయ్యారు. దీంతో, ఆయన ఇంటి వద్ద నుంచి పోలీసులు వెనుదిరిగారు.

# సీఎం చంద్రబాబుకు రూ.1 కోటి విరాళం చెక్ అందించిన బీఎస్సార్ ఇన్ ఫ్రా ఎండీ

### విజయవాడలో వరద విలయం
### లక్షలాది మందిపై ప్రభావం
### భారీగా ముందుకు వస్తున్న దాతలు



విజయవాడ వరద బాధితుల కడగండ్లు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి. తాజాగా, బీఎస్సార్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండీ బలుసు శ్రీనివాసరావు వరద బాధితుల సహాయార్థం రూ.1 కోటి విరాళం ప్రకటించారు. ఇవాళ ఆయన సీఎం చంద్రబాబును కలిసి విరాళం తాలూకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా బలుసు శ్రీనివాసరావును చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. వరద బాధితుల కోసం పెద్ద మనసుతో ముందుకొచ్చిన ఆయనకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇక, రూ.25 లక్షలు విరాళం అందించిన సినీ నిర్మాత అశ్వినీదత్ కు, రూ.25 లక్షలు విరాళం అందించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగం వారికి కూడా చంద్రబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కష్టకాలంలో మీరు అందిస్తున్న మద్దతు నిజంగా అభినందనీయం అని కొనియాడారు. ఈ విరాళాలు వరద బాధితులకు ఎంతో ఊరటనిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో చాలా సంస్థలు, వ్యక్తులు విరాళాలతో ముందుకు వస్తున్నారని, వారందరికీ పేరుపేరునా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వివరించారు.


## 'హైడ్రా'పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు

### హైదరాబాదులో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా
### బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తెచ్చిన పవన్
### హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది రైటేనని వెల్లడి



ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు హైడ్రా. హైదరాబాదులో అక్రమ నిర్మాణాల అంతు తేల్చుతున్న ఈ వ్యవస్థ, కబ్జాదారుల పాలిట సింహస్వప్నంలా మారింది. తాజాగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడ వరదలకు కారణమైన బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తీసుకువచ్చారు. "బుడమేరు పరీవాహక ప్రాంతం అంతా ఇళ్లు కట్టేశారు. ఈ విషయంలో సంబంధింత యంత్రాంగానికి, మున్సిపాలిటీకి, పంచాయతీలకు రెస్పాన్సిబిలిటీ ఉంది. హైడ్రా వంటి వ్యవస్థను తీసుకువచ్చి వీటన్నింటినీ తొలగించవచ్చు. కానీ కొన్ని సమస్యలు వస్తాయి. హైదరాబాద్ లో చెరువులు, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కట్టడం చూశాను. ఇబ్బందులు రావా అనుకునేవాడ్ని! అన్నీ కట్టేసిన తర్వాత కూల్చేయడం కాదు... ఇలాంటి వాటిని ముందే నివారించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అధికారులు వాళ్ల బాధ్యతను వాళ్లు నిర్వర్తించాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వచ్చాక అక్రమ నిర్మాణాలను కూలగొట్టేస్తామంటున్నారు. ఆయన చేస్తున్నది రైటే. అయితే మనం కూడా ఇలాగే వ్యవహరించాలంటే... అనేక సామాజిక సమస్యలు, సామాజిక ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. దీని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# గతంలో గురువులు.. స్కూళ్లు ఎలా ఉండేవంటే...




ఉపాధ్యాయ దినోత్సవం  భారతదేశంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం రోజు సెప్టెంబర్ 5న ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ఆ రోజు సెలవుదినం కాదు. ఉత్సవం జరుపుకొనవలసిన దినం. పాఠశాలలు యధావిధిగా జరిగి, ఉత్సవాలు జరుపుకుంటాయి. ఆ రోజున ఉపాధ్యాయులకు జాతీయ, రాష్ట్రీయ, జిల్లా స్థాయిలలో పురస్కారాలు, గౌరవసత్కారాలు జరుగుతాయి. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంసెప్టెంబర్ 5వ తేదీన జరుపుకుంటారు.

మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నాము చదువు అనంతమైంది. అందులో ఏది కావాలన్నాదొరుకుతుంది. ఈ రోజుల్లో అయితే అవసరానికి తగ్గట్టు నేర్చుకోవడానికి వందల సబ్జెక్టులున్నాయ్. అందులో ఎవరికి ఏది కావాలో ఆ సబ్జెక్ట్ మాత్రమే నేర్చుకుంటే సరిపోతుంది. కానీ ఒకప్పుడు అలా కాదు. అందరికీ ఒకటే విద్య, ఒక్కటే గురుకులం. మరి అప్పట్లో ఏ సబ్జెక్ట్స్ నేర్పేవాళ్లు? అసలు నిజమైన విద్యలో ఏయే సబ్జెక్ట్స్ ఉంటాయి? ఇప్పుడున్న విద్యా విధానంలో... మనిషి పెరిగి, పెద్దయ్యే వరకూ ఒక్కో దశలో ఒక్కో గురువు మారుతూ ఉంటాడు. ప్రతీ ఒక్కరూ ఒక్కో విషయం నేర్పుతూ వ్యక్తిని సంపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దడంలో సాయపడతారు. అయితే ఇప్పటి స్కూల్స్ లాగానే ఒకప్పుడు గురుకులాలు ఉండేవి. కానీ అక్కడ ఇన్నేసి క్లాస్ లు , టీచర్లు ఉండరు ఉండేది ఒకే గురువు. ఆయనే జీవితానికి కావల్సిన పాఠాలన్నీ నేర్పేవాడు. ఆ గురువులు డిజైన్ చేసిన కరిక్యులమ్ అప్పుడే కాదు ఇప్పటికీ ఎంతో ఆదర్శం.

**గురువు అంటే...**

ప్రతీ ఒక్కరూ జీవితంలో ఏదో ఒక స్టేజ్ లో గురువు దగ్గర విద్యను నేర్చుకుంటారు. ఆ దశలో నేర్చుకున్న విషయాలే మొత్తం జీవితానికి అన్వయించుకుంటారు. జీవితానికి పరిపూర్ణత లభించేది గురువు దగ్గరే. సంపూర్ణ జ్ఞానం. పొందిన గురువే దాన్ని ఇవ్వగలుగుతారు. నాణేనికి బొమ్మ, బొరుసు ఉన్నట్లే మనిషికి కూడా భౌతిక, ఆధ్యాత్మిక జీవితం రెండూ ఉంటాయి. నిద్ర లేచినప్పటి నుంచి చేసే రకరకాల పనులు, మానసిక ఒత్తిడులు, టెన్షన్లతో టైం వేగంగా వెళ్లిపోతూ ఉంటుంది. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు చేసే యాక్టివిటీస్ అన్నీ భౌతిక జీవితం కిందకు వస్తాయి.

రెండవది ఆధ్యాత్మిక జీవితం.. అది మనలోనే దాగి ఉంది. మనల్ని సత్యం వైపునకు నడిపించడానికి సిద్ధంగా ఉంటుంది. కానీ అది అంత సులభంగా దొరికి జ్ఞానం కాదు. దాన్ని గుర్తించడం చాలా కష్టం కానీ దాన్ని కనుక్కోలేక పోతే భౌతిక జీవితం ఎంత జీవించినా వృథానే. అయితే ఈ సృష్టిలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అర్థమయ్యే రీతిలో అందించే ఏకైక వ్యక్తి గురువు. ఆధ్యాత్మికంగా పరిపూర్ణ జీవితాన్ని ఎలా పొందాలో, భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలను ఎలా బ్యాలెన్స్ చేయాలో గురువు మాత్రమే బోధించగలడు.

ఆశ్రమమే ఒక పాఠం

గురుకులాల్లో ఉండే కరిక్యులమ్ ఒకటే. అదే నిజమైన జ్ఞానం నిజమైన జ్ఞానం ఇంటే... సామాజిక విలువలు, నీతి శాస్త్రం, సంస్కృతీ సంప్రదాయాలు, బుద్ధి, క్రమశిక్షణ, పౌర. రాజకీయ ధర్మాలు, ఇతర శాస్త్రాలు, వీటితోపాటు ఆత్మ జ్ఞానం. అయితే వీటన్నింటినీ పుస్తకాలు, గ్రంథాల రూపంలో కాదు. ప్రాక్టికల్స్ గా నేర్పడమే. గురువు ప్రత్యేకత. దానికోసం అప్పట్లో ఆశ్రమ విధానం ఉండేది. ఊహ తెలిసిన వయసులో ఆశ్రమానికి వచ్చి, పూర్తి, విద్యను నేర్చుకునే దాలా ఇక్కడే కొన్నేళ్ల పాటు ఉండాలి. ఈ ఆశ్రమాలకు నియమనిబంధనలతో కూడిన ఒక జీవన విధానం ఉంటుంది. అందుకే కేవలం ఇక్కడ నివసించడం వల్లనే వ్యక్తి జీవితంలో ఉపయోగపడే ఎన్నో విషయాలు నేర్చుకోగలుగుతాడు.

**కరిక్యులమ్ ఇదీ...**

మనిషికి కావాల్సిన విషయాలన్నీ నేర్చుకునే విధంగా గురుకులంలో కరిక్యులమ్ డిజైన్ చేసేవాళ్లు. సమాజంలో జరిగే వాటిని ఎలా విశ్లేషించాలి? వాటికి ఎలా స్పందించాలి? అనేవి గురువు నేర్పిస్తే జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? వాటిని ఎదుర్కోవడానికి ఏయే నైపుణ్యాలు అవసరం? అనేది ఆశ్రమంలో విద్యార్థులు సొంతంగా నేర్చుకుంటారు. వినయంగా, భాధ్యతగా, ఎలా ఉండాలో శిష్యుడు ఆశ్రమంలో సొంతంగా అలవాటు చేసుకుంటాడు. ఆశ్రమంలోని జీవన విధానమే. శిష్యుడి ఓ పాఠం. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం కోసం గురువు ఆశ్రమంలో కొన్ని కృతిమ పరిస్థితులు సృష్టిస్తాడు. ఆత్మ స్థైర్యం, అవగాహన, విశ్లేషణ లాంటివి పాఠాల రూపంలో బోధిస్తే బోధపడవు అందుకే గురువు కొన్ని పరీక్షల ద్వారా వాటిని అలవరచుకునేలా చేస్తాడు. అలా గురువు పెట్టి పరీక్షల ద్వారా శిష్యుడు తనకు తాను మానసికంగా దృఢంగా తయారవుతాడు. బయట విషయాలతో పాటు కొన్ని నైపుణ్యాలు కూడా అలవరచుకుంటాడు. అలాగే ఎకనమిక్, పాలిటాక్స్ లాంటివి కూడా కేవలం పుస్తకాల్లో కాకుండా నిజ జీవితంలో అనుభవం ద్వారా ప్రాక్టికల్‌గా నేర్చుకునే వీలుంటుంది . గురుకులాల్లో శిష్యుడి స్థాయిని బట్టి వాటిని ఎలా నేర్పాలో ప్రణాళిక వేసి నేర్పిస్తాడు గురువు చదువుతోనే ఆగకుండా ఆత్మ రక్షణకు అవసరమైన విద్యలు, యుద్ధ విద్యలు కూడా గురువే నేర్పుతాడు.

**ఒకరికి ఒకరై..**

గురుకులంలో ఒకే గురువు జీవితానికి సరిపడా విషయాలన్నీ నేర్పుతాడు. మనిషికి ...సమాజానికి కావాల్సిన పురుషార్థాలను అలవరుస్తాడు. ఇక్కడ గురుశిష్యులు ఇద్దరూ కలిసిమెలిసి జీవిస్తారు. నిత్యావసర వస్తువుల గురించి ఇద్దరికీ బెంగ ఉండదు. సంతృప్తిగా జీవించేవారు. క్రమశిక్షణ, మర్యాదలకు ఎలాంటి లోటు ఉండదు . ఎంతో పెద్ద తప్పుచేస్తే తప్ప శిక్షలకు దండనలకు అవకాశం ఉండేది కాదు ఇలాంటి విధానాలపల్ల గురువుకి శిష్యుడికి మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉండేవి. అలాగే శిష్యుడికి గురువుమీద అమితమైన ప్రేమ, గౌరవం బలపడుతాయి.

**గురువు ఒక అదృష్టం**

మొత్తానికి విద్యావిధానాల్లో ఎన్నిమార్పులొచ్చినా గురువు ఎప్పటికీ గురువే... గురువు.. ఎలాంటి కరిక్యులమ్ డిజైన్ చేసినా అది అప్పటి పరిస్థితులకి సొల్యూషన్ చెప్పేదిలా ఉంటుంది. శిష్యుడికి ఏది అవసరమో తెలిసి, వ్యక్తి అజ్ఞానాన్ని తొలగించి, నిజమైన జ్ఞానాన్ని అందించగలవాడే గురువు.

గురువు మనతో సహజీవనం చేస్తూ మన లాగే తప్పొప్పులు చేస్తూ ఉన్నట్లు కనబడుతూ మనల్ని చెయ్యి పట్టి నడిపిస్తూ ఉంటాడు. అలాంటి గురువు దొరకడం శిష్యుడి అదృష్టం. గురువుకి శిష్యుడిపై ప్రేమ విశ్వాసం ఎప్పటికీ తగ్గవు, గురువు ఎప్పుడూ శిష్యుడి క్షేమంతో పాటు లోకక్షేమం. దేశ క్షేమం గురించి కూడా ఆలోచిస్తుంటాడు.విద్యావిధానంలో మరో ముఖ్యమైన అంశం బ్రహ్మ చర్యం ఆశ్రమంలో ఉన్నన్ని రోజులు శిష్యులు. కఠోర బ్రహ్మ చర్య దీక్ష పాటించాలి బ్రహ్మచర్యంలో కఠినమైన నియమాలుంటాయి. విద్యార్థి దశలో ఎన్నో ఆలోచనలు పక్కదోవ పట్టిస్తుంటాయి. వాటిని అదుపులో పెట్టేందుకే బ్రహ్మచర్య దశలో కొన్ని పరిచమైన నియమాలకు గురువు నిర్దేశిస్తారు. పన్నెండేళ్ల పాటు బ్రహ్మచర్య దీక్ష పాటించిన శిష్యుడు బలమైన వ్యక్తిత్వంతో బయటకు వస్తాడు. బ్రహ్మచర్యం లో పాటించిన నియమాలు ఇండివిడ్యువాలిటీని పెంపొందిస్తాయి ఆశ్రమం నుండి బయటకు వచ్చాక మీ జీవితంలో కూడా ఎన్నో సమస్యలకు బ్రహ్మచర్యం పరిష్కారం చూపుతుంది.

# మట్టి గణపతినే ఎందుకు పూజించాలి? పురాణాలు ఏం చెబుతున్నాయి?



పుట్టుక చిత్రం పునర్జన్మ విచిత్రం వినాయకుడి గాథలు చిత్రవిచిత్రం గణపతి.. సురపతి కావడం కొండంత ఏలిక చిట్టి ఎలుకను అధిరోహించడం అసురుల భరతం పట్టడం.... భారతం రాయడం కోసం ఘంటం చేతపట్టడం ...ఇలా ఏకదంతుడి కథలు జగమంతా తలుచుకుని మురిసిపోయే శుభఘడియ వినాయక చవితి. ఈ పర్వదినం సందర్భంగా తొలిపూజలు అందుకునే మేటివేలుపు తత్త్వాన్ని తెలుసుకుందాం.వినాయకుడి పేరు పలకగానే ఏదో తెలియని శక్తి మనల్ని ఆవహిస్తుంది. అంతులేని ఆనందం కలుగుతుంది. పసిబిడ్డల నుంచి పండు ముసలి వరకు గణపతి అనగానే ఓ చైతన్యం తమను ఆవహించినట్లుగా భావిస్తారు. వినాయకుడు తనకు మాత్రమే చెందిన దేవుడు. తన గోడు వింటాడు. తనకు ఏ కష్టమూ రానివ్వడని ప్రతి భక్తుడూ భావిస్తాడు. భక్తుల మనసులలో ఇంతగా సుప్రతిష్ఠితమైన గణపతి ఆరాధనలో అనంతమైన ఆధ్యాత్మిక భావాలు నిక్షిప్తమై ఉన్నాయి. ముద్గలపురాణంలో వినాయకచవితి పూజా నియమాల గురించి విస్తారంగా వర్ణితమై ఉంది. కణ్వమహర్షి భరతుడికి గణపతి తత్త్వాన్ని, భాద్రపద శుక్ల చవితి వ్రత మహిమ గురించి వివరించినట్లు అందులో ఉంది. ప్రధానంగా మట్టి గణపతిని ఎందుకు పూజించాలనే విషయాన్ని ముద్గలపురాణం స్పష్టంగా చెబుతున్నది.

**మట్టి గణపతే శ్రేష్ఠం**

ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు ఏర్పడ్డాయి. నీటి నుంచి భూమి ఏర్పడింది. భూమి జడపదార్థం. నీరు ప్రాణాధార శక్తి. ఈ రెండు పదార్థాలు కలవటం వల్ల అంటే జడపదార్థమైన భూమి చైతన్యం కలిగిన నీళ్లతో చేరినప్పుడు ప్రాణశక్తి కలుగుతుంది. తద్వారా ఆహార పదార్థాలు, ఓషధులను మనకు అందిస్తుంది. ఈ విధంగా ప్రాణాధార, జడశక్తుల కలయికతో సృష్టి సాగుతున్నదని చెప్పడానికి సంకేతంగా గణపతి విగ్రహాన్ని మట్టి, నీరు కలిపి తయారుచేసి, ఆ మృణ్మయ మూర్తిని పూజించే విధానం ఏర్పడింది.

మట్టి గణపతిని పూజించటంలో యోగశాస్త్ర రహస్యాలు కూడా ఉన్నాయి. మానవ శరీరంలో ఉండే షట్చక్రాల్లో మొదటిది మూలాధార చక్రం. ఇది వెన్నుపూస ప్రారంభంలో ఉంటుంది. యోగశాస్త్రం ప్రకారం మూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం పృథ్వీ తత్త్వం కలిగి ఉంటుంది. పృథ్వి అంటే భూమి. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవత అయిన గణపతిని అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలుగుతుంది.

పంచభూతాలకు ప్రతీక

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాల్లోని ప్రతి భూతంలోనూ, దాని తత్త్వం 1/2 వంతు, మిగిలిన నాలుగు భూతాల తత్త్వాలు ఒక్కొక్కటి 1/8 వంతుగా ఉంటాయి. భూమిని తీసుకుంటే అందులో భూతత్త్వం 1/2 భాగం అయితే, 1/8 భాగం జలం, 1/8 భాగం అగ్ని, 1/8 భాగం వాయువు, 1/8 భాగం ఆకాశం ఉంటాయి. దీన్నే 'పంచీకరణం' అంటారు. ఒక్కో తత్త్వానికి ఒక్కో అధిష్ఠాన దేవత ఉంటారు. భూతత్త్వానికి అధిష్ఠాన దేవత గణపతి, ఆకాశ తత్త్వానికి ఈశ్వరుడు (శివుడు), జల తత్త్వానికి నారాయణుడు, అగ్ని తత్త్వానికి అంబిక, వాయు తత్త్వానికి ప్రజాపతి (బ్రహ్మ) అధిదేవతలు. మనం పూజించే మట్టి విగ్రహంలో గణపతి తత్త్వం 1/2 భాగం ఉండగా, మిగిలిన దేవతల తత్త్వాలు అన్నీ కలిపి 1/2 భాగం ఉంటాయి.

**'ఆకాశాత్ పతితం తోయం యథా గచ్ఛతి సాగరం, సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి'**

అన్నట్లు ఎన్నో రూపాల్లో, ఎన్నో విధాలుగా కనిపించినా పరమాత్మ ఒక్కడే అనే సందేశం మట్టి గణపతి ఆరాధనలో వ్యక్తమవుతుంది. మనం మట్టితో చేసే గణపతి విగ్రహం పంచమహాభూతాల సమాహారం. ఆ మట్టి ప్రతిమను పూజించటం ద్వారా పంచభూతాలను, వాటి అధిష్ఠాన దేవతలను పూజిస్తున్నాం అన్నమాట. ఈ ప్రయోజనం ఇతర పదార్థాలతో చేసే గణపతి మూర్తులను ఆరాధించడం వల్ల కలగదు. ఏ తత్త్వాలతో ఒక వస్తువు ఏర్పడుతుందో, తన జీవితకాలం పూర్తయిన తర్వాత ఆ తత్త్వాలలోనే ఆ వస్తువు లయం అవుతుంది. ఇది సృష్టి ధర్మం. వినాయక విగ్రహాన్ని నీళ్లలో కలపడం వల్ల, ఆ విగ్రహంలో ఉన్న పంచతత్త్వాలు క్రమంగా వాటిలో లీనమవుతాయి.

# అనుకున్నది సాధించాలంటే గురువు ఉండాలి..



ప్రతి ఒక్కరి జీవితంలో గురువు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. ఉపాధ్యాయులు.. విద్యార్థుల తప్పులను సరిదిద్ది వారి జీవితాలను సన్మార్గంలో నడిపిస్తారు. అందుకే ఉపాధ్యాయులకు ఒక రోజు కేటాయించారు. ఆ రోజే ఉపాధ్యాయ దినోత్సవం. భారత దేశంలో ప్రతేడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజు ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పని, ప్రాముఖ్యతకు అంకితం చేశారు.మనుషులు ఏదేదో సాధించాలను కుంటారు. వాటికోసం కలలు కంటారు. కష్టపడాలని అనుకుంటారు. అయినా, అసుకున్నది సాధించేవాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఎందుకు ఇలా జరుగుతుంది? ఇలాంటి వాళ్లు దేన్నీ ఎన్ని టికీ సాధించలేరని స్వామి వివేకానంద ఒక సందర్భంలో చెప్తారు. ఆ గుర్తులే ఇవీ.

భవిష్యత్తులో ఏం జరుగుతుందోనని దీన్ని సాధించలేరు. ఇది సత్యమని, మంచిదని మీరు అర్థం చేసుకుంటే... వెంటనేదాన్ని ఆచరించాలి

అసూయనీ.. పొగరుని విడిచిపెట్టండి. ఇతరులకు మంచి చేసే కార్యం కోసం సమిష్టిగా కృషి చేయడం అలవరుచుకోండి. కలిసి నడవండి. మనదేశానికి ఇప్పుడు ఇదే కావాల్సింది

నిలువెల్లా స్వార్థం నిండిన వ్యక్తి ఈ లోకంలో ఎక్కువ దుఃఖాన్ని అనుభ విస్తారు. అలాంటివాళ్ల సంతోషం ఎక్కువ కాలం నిలవదు. స్వార్థం లేని మనిషి అసలు సిసలు పరమానందాన్నిపొందుతాడు.

మన చుట్టూ ఉండే విషయాలు ఎప్ప టికీ బాగుపడవు లేదా మెరుగుపడవు. అవి ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. వాటిలో మనం తెచ్చే మార్పులతో మనమే పరిణితిని పొందుతాం.

ఏదో ఒక ఆదర్శాన్ని కలిగి ఉన్న వ్యక్తి వెయ్యి పొరపాట్లు చేస్తే, ఏ ఆదర్శము లేనివాడు యాభైవేల పొరపాట్లు చే స్తాడని నేను గట్టిగా నమ్ముతున్నాను. కాబట్టి, ఒక ఆదర్శం కలిగి ఉండటం మంచిది

# హర్యానా ఎన్నికల్లో.. కాంగ్రెస్ అభ్యర్థులుగా వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా




న్యూఢిల్లీ: రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ లో చేరారు. రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బుధవారం ( సెప్టెంబర్ 4) మధ్యాహ్నం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిశారు. హర్యానా ఎన్నికల సమయంలో వినేష్, పునియా కాంగ్రెస్‌లో చేరడం కీలక పరిణామం అన్నారు రాహుల్ గాంధీ. వచ్చే నెల(అక్టోబర్) లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల జరుగనున్న క్రమంలో కాంగ్రెస్ బుధవారం కాంగ్రెస్ ఎన్నికల సంఘం సమావేశమయ్యింది. ఈ సమావేశంలో వినేష్ ఫోగట్‌ను కాంగ్రెస్ తరపున హర్యానాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో దేనికైనా పోటీ చేయడానికి కాంగ్రెస్ ఆఫర్ చేరసింది. చర్కీదాద్రి, బద్ధా, జులనా నియోజ కవర్గాల నుంచి దేనికైనా పోటీ చేసేందుకు వినేష్ ఫోగట్ కు ఆఫర్ ఇచ్చారు. చర్కీ దాద్రీ వినేష్ ఫోగట్ సొంత జిల్లా.., ఆమె సొంత గ్రామం బలాలీ.. బద్ధాడా అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. ఇక ఆమె అత్తమామల ఇల్లు జులనాలో ఉంది.. దీంతో కాంగ్రెస్ ఈ మూడు నియోజకవర్గాలనుంచి వినేష్ ఫోగట్ కు పోటీ చేయాలని కోరారు. మరోవైపు బజరంగ్ పునియా కూడా కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చింది. బహదూర్ ఘర్ లేదా భివానీ నుంచి రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ రెండు స్థానాలు జాట్ ల ప్రాబల్యం ప్రాంతాలు. అయితే బద్లీ , ఝజ్జర్ లోని సోనిపట్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని బజరంగ్ పునియా చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బలంగా ఉన్నారు. బద్లీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కులదీప్ వత్స్.. హర్యానా కాంగ్రెస్ ప్రముఖులలో ఒకరు.. దీంతో ఆయన టికెట్ రద్దు చేయడం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. సోనిపట్ లోని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేంద్ర పర్వాన్ ఓ కేసులో జైలులో ఉన్నారు. ఆ స్థానం నుంచి అతని కుటుంబ సభ్యులలో ఒకరికి టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

అయితే ఇప్పటివరకు బజరంగ్ పునియా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదని తెలుస్తోంది.

# తెలంగాణలో 41 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్స్

తెలంగాణ ప్రభుత్వం 2024 కు గానూ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. 41 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. సెప్టెంబర్ 5న టీచర్స్ డే సందర్భంగా బెస్ట్ టీచర్స్ అవార్డ్ అందుకోబోయే ఉపాధ్యాయులు.. అధ్యాపకుల పేర్లను ప్రకటించింది విద్యా శాఖ.

సెప్టెంబర్ 5న సాయంత్రం రవీంద్ర భారతిలో 41 మంది ఉపాధ్యాయులు బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ అందుకొనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ బెస్ట్ టీచర్స్ అవార్డులు అందుకోనున్నారు ఉపాధ్యాయులు.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**202 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**81 పాయింట్లు క్షీణించి 25,198 పాయింట్ల వద్ద ముగిసిన నిఫ్టీ**

**నష్టాల్లో ముగిసిన బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్**



ప్రతికూల అంతర్జాతీయ సెంటిమెంట్ కారణంగా నేడు భారత స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 202 పాయింట్లు క్షీణించి 82,352 వద్ద, నిఫ్టీ 81 పాయింట్లు నష్టపోయి 25,198 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. నిఫ్టీ బ్యాంక్ 288 పాయింట్లు నష్టపోయి 51,400 వద్ద, నిఫ్టీ ఐటీ 400 పాయింట్లు క్షీణించి 42,450 వద్ద ముగిసింది. ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫిన్ సర్వీస్, మెటల్, ఎనర్జీ సూచీలు నష్టాల్లో ముగియగా... ఫార్మా, ఎఫ్ఎంసీజీ, రియాల్టీ, మీడియా రంగాలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 30 స్టాక్స్‌లో ఏషియన్ పేయింట్స్, హెచ్‌యూఎల్, అల్ట్రా టెక్ సిమెంట్, సన్ ఫార్మా, బజాజ్ ఫిన్ సర్వ్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్ టాప్ గెయినర్లుగా నిలిచాయి. విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, మహీంద్రా, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, టీసీఎస్ టాప్ లూజర్లుగా నిలిచాయి.

# అధికారిక ప్రకటన.. రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా ద్రవిడ్




అనుకున్నదే జరిగింది. టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. ఐపీఎల్ 2025 లో రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ గా ఆయన బాధ్యతలు చేపట్టనున్నాడు. ద్రవిడ్ ఇటీవలే రాజస్థాన్ ఫ్రాంచైజీతో ఒప్పందం కుదుర్చుకున్నాడని %జుగ్రాచీఎతీఱఎఱఅటశీ% ఖరారు చేసింది. ప్రస్తుతం విరామంలో ఉన్న ఈ భారత మాజీ ప్లేయర్ 2025 మెగా వేలానికి ముందు ప్లేయర్ రిటెన్షన్‌లపై త్వరలోనే చర్చలు జరపనున్నాడు.

భారత జట్టు ప్రధాన కోచ్ గా రాహుల్ ద్రవిడ్ ఉన్న సమయంలోనే టీమిండియా ఇటీవలే టీ20 వరల్డ్ కప్ 2024 గెలుచుకుంది. ఈ ట్రోఫీ తర్వాత భారత జట్టు కోచ్ గా రిటైర్మెంట్ ప్రకటించి.. ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో కలవనున్నాడు. 2021 నుండి రాయల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న కుమార్ సంగక్కర తన పాత్రలోనే కొనసాగుతాడు. ఇదిలా ఉండగా.. ద్రవిడ్ హయాంలో భారత బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న విక్రమ్ రాథోర్‌ను రాయల్స్ ఫ్రాంచైజీ తన అసిస్టెంట్ కోచ్‌గా నియమించుకోవచ్చని %జుగ్రాచీజతీఱఎఱఅటశీ% తెలిపింది. ద్రవిడ్ కు రాజస్థాన్ రాయల్స్ కు మధ్య చక్కని అనుబంధం ఉంది. రాజస్థాన్ రాయల్స్ తరపున కెప్టెన్ గా ఆడిన ఈ మాజీ భారత ప్లేయర్.. 2013లో ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ కు జట్టును ఫైనల్ కు చేర్చాడు. 2012, 2013లో సీజన్‌లలో రాయల్స్ కెప్టెన్ గా ఉన్నాడు. 2014, 2015లో రాజస్థాన్ జట్టు మెంటార్ గా ఉన్నాడు. ఆ తర్వాత టీమిండియా అండర్ 19 జట్టుకు కోచింగ్ ఇవ్వడం.. నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్ అయ్యాడు. నవంబర్ 2021లో రవిశాస్త్రి స్థానంలో టీమిండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు.

# ఒక్క మ్యాచ్ కాదు.. సిరీస్‌లా జరపాలి.. రోహిత్ నిర్ణయాన్ని సమర్ధించిన ఆసీస్ స్పిన్నర్




ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్ వరుసగా రెండు సార్లు ఓడిపోయిన సంగతి తెలిసిందే. రెండు సంవత్సరాలు అద్భుతంగా ఆడి ఫైనల్ కు చేరుకున్నా భారత్ కు నిరాశ తప్పలేదు. 2021 లో జరిగిన ఫైనల్లో భారత్ పై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 2023 ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్ లో ఆస్ట్రేలియా 229 పరుగుల భారీ తేడాతో భారత్ ను ఓడించింది.రెండు సార్లు భారత్ టేబుల్ టాపర్ గా నిలిచినా ఫైనల్ గండాన్ని దాటలేకపోయింది. దీంతో భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ ఛాంపియన్ షిప్ పై గతంలో ఫైనల్ పై కీలక సూచనలు చేశాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మూడు మ్యాచ్ ల సిరీస్ గా జరగాలని తన అభిప్రాయాన్ని తెలిపాడు. రోహిత్ వ్యాఖ్యలకు తాజాగా ఆసీస్ స్టార్ స్పిన్నర్ సమర్ధించాడు."వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఒకే మ్యాచ్ గా కాకుండా మూడు మ్యాచ్ ల సిరీస్ గా జరపాలి. టెస్ట్ మ్యాచ్ లో సెషన్ తో మ్యాచ్ మారిపోతుంది. ఒక మ్యాచ్ ఓడిపోయినా పుంజుకోవడానికి అవకాశం ఉంటుంది. రెండు జట్లకు ఇది ఛాలెంజింగ్ గా ఉంటుంది. ఈ ఒక్క చేయాలని నేను కోరుకుంటున్నాను" అని లియాన్ రోహిత్ మాటలకు ఏకీభవించాడు.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ విషయానికి వస్తే ప్రస్తుతం భారత్ టాప్ లో ఉంది. ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతుంది. ఈ రెండు జట్లు ఈ ఏడాది చివర్లో 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడనున్నాయి. న్యూజిలాండ్ (3), ఇంగ్లండ్ (4), శ్రీలంక (5), దక్షిణాఫ్రికా (6), బంగ్లాదేశ్ (7) టాప్ 2 లో చోటు సంపాదించాలని ధీమాగా ఉన్నాయి. వచ్చే ఏడాది (2025) జూన్ 11 నుంచి 15 మధ్య ఐకానిక్ లార్డ్స్‌లో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరుగుతుంది.

# టాప్ 10 నుండి ఔట్.. భారీగా పడిపోయిన బాబర్ ర్యాంక్




బంగ్లాదేశ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో పేలవ ప్రదర్శనతో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ టెస్ట్ ర్యాంకింగ్ దిగజారింది. అతను మూడో స్థానం నుంచి ఏకంగా 9 స్థానాలు దిగజారి 12 వ స్థానంలో నిలిచాడు. టెస్టుల్లో దారుణమైన బ్యాటింగ్ తో జట్టుకు భారంగా మారుతున్నాడు.

సొంతగడ్డపై ఫామ్ లో వస్తాడనుకుంటే పసికూన బంగ్లాదేశ్ పై ఆడలేక చతికిల చతికిల పడ్డాడు.బంగ్లాదేశ్ తో సొంతగడ్డపై జరిగిన రెండు టెస్టు మ్యాచ్ ల సిరీస్ లో బాబర్ ఫ్లాప్ షో చేశాడు.తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్ లో డకౌట్ కాగా.. రెండో ఇన్నింగ్స్ లో 22 పరుగులు మాత్రమే చేశాడు. రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్ లో 31 పరుగులు చేసిన బాబర్.. తాజాగా రెండో ఇన్నింగ్స్ లో 11 పరుగులకే పరిమితమయ్యాడు. ఈ సిరీస్ లో అద్భుతంగా ఆడిన పాక్ వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజవాన్ టాప్ 10లో చోటు సంపాదించాడు.

ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 922 రేటింగ్ పాయింట్లతో టెస్టుల్లో నెంబర్ వన్ స్థానంలోనే కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ రెండో స్థానంలో నిలిచాడు. టీమిండియా తరపున ముగ్గురు ఆటగాళ్లు టాప్ 10 లో చోటు దక్కించుకున్నారు. రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్, విరాట్ కోహ్లీ వరుసగా 6,7,8 స్థానాల్లో నిలిచారు.

బౌలింగ్ విషయానికి వస్తే టీమిండియా వెటరన్ స్పిన్నర్ అశ్విన్ (870) తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుమ్రా (847) మూడో స్థానంలో.. జడేజా(788) ఏడో స్థానంలో ఉన్నారు. టీమ్స్ లో ఆస్ట్రేలియా (124) అగ్ర స్థానంలో.. ఇండియా(120) రెండో స్థానంలో ఉన్నాయి.

# నా యూనివర్స్ నుంచి త్వరలో కొత్త తేజస్సు..ప్రశాంత్ వర్మ పోస్ట్ మోక్షజ్ఞ కోసమేనా!: క్లారిటీ



వైట్‌లో గార్జియస్ కావ్యా థాపర్ విజన్

నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ టాలీవుడ్ ఎంట్రీ కోసం ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా మోక్షజ్ఞ ఎంట్రీ గురించి చాలా న్యూస్ వైరల్ అవుతూనే ఉన్నాయి. గ్రాండ్ లెవల్లో ఉందనున్న ఆ సినిమా కోసం చాల మంది స్టార్ డైరెక్టర్స్ పోటీపడుతున్నారని వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇపుడు ఈ లిస్టులో మరో లేటెస్ట్ స్టార్ డైరెక్టర్ చేరిపోయారు. ఆ దర్శకుడు మరెవరో కాదు హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ప్రశాంత్ వర్మ అవును..ప్రశాంత్ వర్మ తన దగ్గర చాలా సూపర్ హీరో కాన్సెప్ట్లు ఉన్నట్టుగా గతంలోనే చెప్పారు. ఆ కథల్లో ఒక సూపర్ హీరో కథను ఇప్పటికే బాలకృష్ణకు వినిపించాడట ప్రశాంత్ వర్మ. అయితే, తాజాగా ఓ సింహం తన పిల్లను ఎత్తుకొని చూపుతోన్న పోస్ట్ పెట్టిన ప్రశాంత్ వర్మ..'నా యూనివర్స్ నుంచి త్వరలోనే ఓ కొత్త తేజస్సు రానుంది' అని రాశారు. దీనికి 'సింబా ఈజ్ కమింగ్' అనే హ్యాష్‌ట్యాగ్ పెట్టారు. దీంతో మోక్షజ్ఞ ఎంట్రీని ఉద్దేశించే ప్రశాంత్ ఈ పోస్ట్ పెట్టారని అందరూ అనుకుంటున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై సెప్టెంబర్ 6న అధికారిక ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. అలాగే ఇటీవల ప్రశాంత్‌వర్మ పెట్టిన మరో పోస్ట్ కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఒక ఫొటో షేర్ చేస్తూ..'ఛాలెంజ్‌ని స్వీకరిస్తున్నా' అని రాశారు. అయితే ఈ పోస్ట్ వెనుక ఓ బడా మల్టీస్టారర్ ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇటీవలే బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవంలో చిరు మాట్లాడుతూ.."నాకు బాలయ్యతో కలిసి ఒక ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఒక కోరిక. అందుకు తగ్గ కథ రెడీ చేయాలని దర్శకులకు ఛాలెంజ్ ఇస్తున్నా" అని అన్నారు.ఈ కామెంట్స్ చేసిన మరుసటి రోజే ఛాలెంజ్ స్వీకరిస్తున్న అని ప్రశాంత్ పోస్ట్ పెట్టడం విశేషం. ఇక గతంలో బాలకృష్ణ హోస్ట్ గా చేసిన అన్ స్టాపబుల్ షోకి ప్రశాంత్ వర్మ డైరెక్టర్ గా చేసిన విషయం తెలిసిందే. ఇక అప్పటినుండి ప్రశాంత్ వర్మపై బాలకృష్ణకు బలమైన నమ్మకం ఏర్పడింది. ఇటీవల ఆయన చేసిన హనుమాన్ సినిమా చూశాక ఆ నమ్మకం మరింత పెరిగింది. అందుకే.. తన వారసుడిని ఎంట్రీ సినిమాను ప్రశాంత్ వర్మ చేతిలో పెట్టాలని ఫిక్స్ అయ్యాడట బాలకృష్ణ. అయితే.. ప్రస్తుతం రూమర్ గానే ఉన్న ఈ వార్తల్లో నిజమెంత అనేది తెలియాలంటే అధికారిక ప్రకనట వచ్చే వరకు ఆగాల్సిందే.



రాశి ఖన్నా యొక్క అద్భుతమైన క్లిక్‌లు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com